# మహాగబాధ

డాక్టర్ సంజీవ్ కుర్చీతో కూర్చుని, సిగరెట్ పీలుస్తూ ఆలో చిస్తున్నాడు! ఇంకో ఘడియలో థియేటర్‌లోకి వెళ్ళాలి! ఎదురుగుండా స్క్రీన్‌మీద ఎక్స్‌రేలు వ్రేళ్ళాడుతున్నాయి! అసిస్టెంటులూ, నర్సులూ తొందర తొందరగా అన్నీ రెడీ చేస్తున్నారు! ఇవతల తలకి కట్లతోనూ, కాళ్ళకి, చేతులకి కట్లతోనూ, ఎంతోమంది బాధతో మూలుగుతూ కూర్చు న్నారు!...అర్థోపెడిక్ వార్డంతా బిజీగా వుంది.

అతని ఆలోచనల్లాగే హాస్పిటల్ గోడల నీడలు నల్లగా ప్రాకుతూ సాగుతున్నాయి, ఎరుపెక్కుతూన్న ఎండ, కాసు బంగారంలా మెరిసి పోతూంది!

వెలుగు లేనపుడు నీడలు మనలోనే దాక్కుని వుంటాయి వెలుగు ఎక్కువయినపుడు, మననే అంటిపెట్టుకొని ప్రక్కన పడుతూవుంటాయి! వెలుగు తగ్గుతున్నకొద్దీ-నీడలు పొడుగ్గా సాగుతూ వుంటాయి మృత్యు నీడల్లా!...కాని ఒక్కటే బేధం-వెలుగు పోగానే నీడలు మనలో కలిసి పోతాయి!... ఆ సమయం వస్తే మృత్యువు నీడల్లోకి మునిగి లాగ్గుం టుంది!!

దూరంగా నీలిరంగు సముద్రం...తెల్లటి నురగలూ, కదులుతో వుంటే...నీలి చీర కట్టుకున్న స్త్రీ నడుస్తూన్నపుడు పాదాలమీద కద లాడే తెల్లంచులా వుంది!...

ఏమిటో ఆ ఆలోచనకి...దీనికీ...ఏమైనా సంబంధం వున్నదా? సంజీవ్ మనస్సులో ఏదో బాధ పీడిస్తూంది.

ఇంతలో ఒక సిస్టర్ వచ్చి—

"బాస్ మీ మిసెస్‌కి లేబర్ ప్రారంభమయింది! మిస్ అరుణ ఎటెండవుతున్నారు!" అని చెప్పింది.

ఆ మాటలకి-"ఆఁ!...ఓ కె! ఓ కె!" అని ఈ ప్రపంచంలో పడ్డాడు...కాని ఆ ముఖంలో ఆతృతగాని, ఆనందంగాని ఏమీలేదు! ఎప్పటి బాధాకరమయిన విచారం వుంది.

అతను ఆలోచిస్తున్నది ఆ విషయమే అయితే, అతనిలో మార్పు కలిగేది! తన భార్యా ప్రసవం విషయమై ఇంకా ఆమెని అడుగునేమో! కానీ అతనిలో ఆ ఆతృత వున్నట్టులేదు...ఏదో ఆవేదన మాత్రం హృదయంలో పోలేదు.

తన ముందునుంచి-ట్రాలీమీద థియేటర్‌లోకి తీసుకు వెడుతున్న పేషెంట్‌ని చూశాడు.

ఆ లేత ముఖం...చంద్రబింబంలా వుంది. పాపం! పదహారేళ్ళయినా వుండవేమో! ఆ అమ్మాయికి... మోచేతిదగ్గర అడ్డంగా ఎముక పెరిగి, ఆ చెయ్యి ముడవ పడకుండా పోయింది! ఆ ఎముకను ఆపరేట్ చేసి ఫైల్ చెయ్యాలి. ఇది చాలా జాగ్రత్తగానూ, అనుభవంతోనూ చేయాల్సిన ఆపరేషన్. ఇల్లాంటివి చాలా రేర్ కేసులు కాబట్టి చాలామంది డాక్టర్లు, మెడికల్ స్టూడెంట్లూ చూడ్డానికి ఎటెండవుతున్నారు...

ఆ పిల్ల ఎంత అందంగా వుందంటే-ఆమెని చూసి ఆమె దగ్గర బంధువుల్లో ఒక కుర్రవాడు కట్నం లేకుండా పెళ్ళాడుతానని వాగ్దానం చేశాడట!...

నిజానికి ఈ ఒక్కలోటూ తప్పిస్తే, అంత అందమయిన పిల్ల ఎక్కడోగాని వుండదు—తల్లిదండ్రులను చూస్తే సామాన్యంగా వున్నారు...అంత చెప్పుకోతగ్గ అందమయినవాళ్ళు కాదు!...మరి ఈ

పిల్ల—ఇంత అందంగా ఎట్లా వుంది? అదృష్టం ఎవరి అదృష్టం... ఎవరు చెప్పగలరు?...

—అని ఆలోచిస్తూ ఒక్కగట్టి నిట్టూర్పు విడిచాడు టైమ్ చూసు కొని-లేచాడు...ఆఖరిసారి గట్టిగా సిగరెట్ పీల్చి పారేసేడు. థియేటర్‌లో అందరూ సంజీవ్‌కోసం ఎదురు చూస్తున్నారు. ఆ పిల్లకి ఎనెస్తటిసియా ఇంజక్షను ఇస్తున్నారు...కొద్దిసేపట్లోనే ఆమె జీవశ్చవం అయింది—

తనను నమ్మి ఆ ప్రాణాల్ని తన చేతిలో పెట్టేరు ఆమెకూడా పడివుంది. బ్రతికించినా! చంపినా! బాగుచేసినా పాడుచేసినా? తన చేతిలో వుంది?...ఏమిటా నమ్మకం! నిజంగా తన చేతిలో వుందా?

చేతిని కోసేడు—ఒక్కసారి శరీరం జల్లుమంది. ఏమిటో,మనసు చివుక్కుమంది ఎందుకో, అందాన్ని ముక్కముక్కలు చేస్తున్నట్టని పించింది—తన హృదయంలో వ్యధకి, మనసులో బాధకి, తన విచారపు టాలోచనలకి ఏదో సమాధానం దొరికినట్టు అనిపించి, బాధపడ్డాడు... ఇంతకుముందు ఎన్ని ఆపరేషన్‌లు చేయలేదు. ఎన్నడూ ఇలా అనిపించ లేదు.

ఈనాడు అందానికే ఆపరేషన్ చేస్తున్నాడు? అందుకే తనని ఆ విధంగా శపించాడా? అని అనుకున్నాడు—తన ఆలోచనలకి తనకే కోపం వచ్చింది—ఆలోచనలను మరచి-ఆపరేషన్‌లో పడ్డాడు—అయి పోయింది...రెండంగుళాల ఎముక ముక్కనుకోసి తీసాడు, జాగ్రత్తగా మరి తిరిగి ఎదగకుండా ఫైల్‌చేసి స్టిచ్ చేశాడు.

అప్పటిపరకూ జరిగిన ఆపరేషన్ సక్సెస్‌ఫుల్‌గా జరిగిందన్న సంతోషంతో ఇవతలికి వచ్చేడు. చేతులు తుడుచుకుంటూ—ఎంతో ఆతృతతో వేచివున్న ఆ పిల్ల తల్లి తండ్రి, ఆతృతతో చూస్తున్నారు.

"మరేం భయంలేదు. ఇవాళ ఆమెకి తెలివిరాదు రేపు వస్తుంది. బాధ భరించలేకపోవొచ్చు. జాగ్రత్తగా చూడండి" అని చెప్పేడు.

అది విని ఆ దంపతులు ఎంతో కృతజ్ఞతతో నమస్కరించారు.

మరోసారి ఆ దంపతులను చూశాడు-తన సంగతి తిరిగి జ్ఞాపకం రావడం తిరిగి మొదలెట్టింది-మళ్ళీ బాధ, విచారం, అందులో మునిగి పోయాడు. ఈ సామాన్య దంపతులకి ఇంత అందమయిన పిల్ల?...ఈ ఆలోచన ఎందుకు వస్తూందో విచిత్రంగా వుంది. ఆ తల్లిదండ్రుల ప్రక్కన మరో ఇద్దరు పిల్లలున్నారు. ఉండబట్టక "వీళ్ళు మీ పిల్లలేనా?" అని అడిగాడు.

"అవునండి" అని ఆ వ్యక్తి చెప్పేడు. ఆ ముగ్గురూ ఎంత బాగున్నారని? ఆరోగ్యంగా అందంగా, చూడముచ్చటగా వున్నారు.

ఏమిటి దీనికి కారణం?

విజ్ఞానశాస్త్రం ఏమిటి చెబుతూంది? తల్లిదండ్రులెలావుంటే-అలా సంతానం వుంటుంది అని. ఎంత ఆరోగ్యంగా వాతావరణం, అలవాట్లూ పెంపకం వుంటే అంత ఆరోగ్యంగా అంత మంచివాళ్ళుగా పిల్లలుంటారని అంటుంది- ఇది ఎంతవరకూ నిజం?

అనుకోకూడదుగాని అతను, ఎంతో మంచి పెర్సనాలిటీ గలవాడు. అతని బంధువుల్లోనూ, స్నేహితుల్లోనూ ఎంతోమంది అతనికి పిల్లలనిస్తామని ఎగబడ్డారు. అతను మెడిసిన్ చదువుతున్న రోజుల్లో, ఎంతోమంది గర్ల్‌ఫ్రెండ్స్ వుండేవారు. వాళ్ళు తమలో తాము అతనితో స్నేహం చేద్దామని ప్రయత్నించేవారు. మంచి ఆకర్షణ గలవాడని, వాళ్ళనుకోవడం, వింతేంలేదు. ఆ రోజుల్లోనే ఆ కాలేజీలోనే ఆర్ట్స్ చదువుతున్న సుశీల-సంజీవ్ మనసుకు నచ్చింది. ఆమెకూడా అతనికేం తీసిపోదు. అందంగా వుంటుందని అందరూ వప్పుకున్నదే. అతనికిలాగే ఆమె వెనకాలకూడ చాలామంది పడ్డారు. కానీ—సుశీల సంజీవ్‌కు స్నేహం ఏర్పడింది. మొదట ఫ్రెండ్‌షిప్ తర్వాత ప్రేమవరకూ వచ్చింది.

చదువుకున్నవాళ్ళు నాగరీకులూ ఇంక వాళ్ళని ఎవరు అభ్యంతరం పెట్టగలరు? కొన్నాళ్ళ తర్వాత రిజిష్టరీ మారేజ్‌కూడ అయిపోయింది. రతీమన్మథుల్లా వుంటారని అందరూ అన్నారు.

ఎంత అన్యోన్యంగా సంసారం నడిచిపోయేది! ఆమె డిగ్రీ తీసుకున్నా—ఇంట్లో భార్యగా, సంసారిగానే వుండిపోయింది. అతనుమాత్రం హాస్పిటల్‌లో డాక్టరుగా ఇప్పుడు చీఫ్ సర్జనుగా వున్నాడు. భార్యాభర్తలిద్దరిమధ్యా విభేదాలుగాని, మనస్పర్థలుగాని లేవు. ఆనందంగా మూడు పువ్వులూ, ఆరు కాయలుగా వుంది. కాని...ఒక్కటే—ఒక్క గొప్ప లోపం! అది చాలు! జన్మ జన్మలకూ శిక్ష.

...కాని ఆ శిక్షకు తాము ఎంతవరకూ అర్హులో బోధపడలేదు—ఈ జన్మలో ఎరిగినంతవరకూ—ఏ పాపం అతను చేయలేదు. ఆమె హైందవ స్త్రీ ధర్మం, మరచిపోలేదు. అతను డాక్టరుగా అంతో ఇంతో మానవసేవ చేస్తూనే వున్నాడు. గాని ఎవరికీ అపకారం, అన్యాయం, చేయలేదు. ఎంతో ఉదారంగా వుంటాడు. మిగతా డాక్టర్లతో పోల్చి చూస్తే! ఎటువంటి సమయంలో అతనిని పిలిచినా, అది ఎలాటి సమయమయినా పిలిచినవాళ్ళు ఎలాటి వాళ్ళయినా విధిగా ఎటెండ్ అవుతాడు. ప్రతి కేసునూ తన శాయశక్తులా బాగుచేయడానికే ప్రయత్నించి చూస్తాడు. అతను అనుకున్నట్టుగానే అతని చేతిలో పడినకేసు సాధారణంగా సక్సెస్ అయి తీరుతుంది. అందుకే, ఆ జిల్లాలోనే కాకుండా పైచోట్లకూడా అతను మంచి పాప్యులర్ అయ్యేడు. మంచి పలుకుబడి కీర్తి ప్రతిష్ఠలూ వున్నాయి. మేజర్ ఆపరేషన్లకూ క్రిటికల్ కేసులకు దూర దూరాలనుంచి పిలుస్తూంటారు. నలుగురితోనూ ఎంతో ఉత్తముడని అనిపించుకున్నాడు. కాని ఎందుకో భగవంతుడు—భరించలేని శాపం—పెట్టేడు.

ఇప్పుడు—అతను ఇంటిలో ఆనందంగా గడపలేడు—తన సంసారంలో సుఖసంతోషాలు లేవు. ఇంతకీ కారణం ఎంత వూహించినా తెలియడం లేదు! అదే విచారం అలా బుర్రలో ఎప్పుడూ వుండిపోతూంది... అందుకే అందరూ... "ఏమిటి డాక్టర్! ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూనే వుంటారు?

"మీలాటి వారికూడా ఎప్పుడూ విచారమేనా?—మీకేమిటి

ఎంతో హాయిగా వుండక?" అని అడుగుతూ వుంటారు. ఏమని జవాబు చెప్పగలడు? ఎంతవున్నా, ఎన్ని విధాల తమలోకంలో గొప్పవాడయినా—

ఒక సామాన్యునకున్న ఆనందం తనకులేదు. చెట్టు క్రింద కాపురం చేసే బీద దంపతులకు గల కుటుంబ సౌఖ్యం తనకులేదు. శాంతి... లేదు!

డాక్టరికి డాక్టరయినా, తనూ ఎంతోమంది డాక్టర్లని కన్సల్టు చేశాడు. ఎంతోమంది మహాత్ములని...యోగులని కలిసేడు ఎన్నో పుస్తకాలూ గ్రంథాలూ తిరగవేశాడు. ఎన్నో మందులూ, మాకులూ, త్రాగేడు! సందేహ నివృత్తికోసం! కాని అంతా నిష్ప్రయోజనం. ఆఖరికి భగవదేచ్ఛకి తిరుగులేదనుకున్నాడు. దానిని మానవుడు అనుభవించవల్సిందే గాని ఎంత తప్పించుగుందామని ప్రయత్నించినా లాభంలేదు. ఏ జన్మలోనో అతనుచేసిన పాపానికి అనుభవిస్తున్నాడు. ఇదే నిష్కృతి! అని ఆఖరికి కర్మ సిద్ధాంతాన్ని నమ్మి వూరుకున్నాడు.

ఒక సైకాలిజీ స్పెషలిస్టు, యీతని విచారంచూసి "మనం చేసే పనిమీద...ఆపని చేస్తున్నంతసేపే-కాన్సంట్రేషన్ వుండాలి. ఆ తర్వాత దాని ప్రభావం మన మనసుమీద పని చేయకూడదు! ఇది జ్ఞాపకం వుంచుకొని మీరు అలాచేస్తే మీ సమస్య కొంతవరకూ పరిష్కారం కావొచ్చు" అని సలహా ఇచ్చేడు.

"మీరు హాస్పిటల్‌నూ, రోగులనూ విడిచిపెట్టి ఇంటికి వచ్చాక, మీ మనసును అటువయిపు మరి పోనీకుండా ఈ లోకంతోనూ, మనుషులతోనూ... కలిసిపోయేందుకు, ప్రయత్నించండి." అని స్నేహితులూ సలహా ఇచ్చారు.

ఇందులో చాలా నిజం వున్నదని డాక్టరికి తెలుసు, కాని—అలా వుండడం తనకు చాతకాకుండా వుంది.

...తను విడిచిపెట్టి వెళ్ళిన పిల్లలు, ఎలా వుంటారో ఏమౌతారో అని తల్లి ఎలాగయితే ఎల్లపుడూ ఆలోచిస్తూ వుంటుందో? ఆమె మనసు ఎలా ఆవేదన చెందుతూ వుంటుందో అలాగే అతనూ అతని పేషంట్లను

చూసుకుంటూ వుంటాడు. ఎక్కువ ప్రమాదంగా వున్నవాళ్ళయితే... తన మనసులో మెదులుతూనే వుంటారు. తుడిచిపెట్టుకుందామన్నా, ఆ ఆలోచనలను త్రోసిపుచ్చలేకుండా వున్నాడు. అదే తనలో వున్న లోపం దుర్బలత! ఇంటికివచ్చినా, భార్యతో మాటాడినా! అదే ప్రస్తావన!

ఆమె చాలాసార్లు "అదేమిటండీ! ఎప్పుడూ ఆస్పత్రిగొడవనలేనా? మరో విషయాలు మాటాడుకోరాదూ?" అని ప్రశ్నించినా అతను మార్చు కోలేకపోయాడు.

ఒక్కొక్కసారి— ఉండి ఉండి, ఎవరో తట్టినట్టులేచి త్వరంగా, గాభరాగా, డ్రెసప్ అయి వెళ్ళిపోతూంటాడు ? అది ఎలాటి సమయ మయినా సరే?—ఎక్కడికి? హాస్పటల్ కే!

సడన్‌గా అలా వచ్చిన బాస్‌ని చూచి, మిగతా డాక్టర్లూ నర్సులూ, గాభరా ఎత్తిపోయి గబగబా ఎక్కడివారక్కడ సర్దుకుంటారు. కాని ఎవరెలా అజాగ్రత్తగా వున్నా ఏమీ అనడు. ఒక్కసారి రౌండ్సుకొట్టి వస్తాడు అంతే! అతని ఈ మనస్తత్వానికి ఆశ్చర్యపోనివారు లేరు.

సంజీవ్ ఈ ఆలోచనల్లో మునిగిపోయాడు. క్రింద హాస్పటల్ గోడల నీడలు...ముడుచుకుంటున్నాయి. వచ్చేజనం పోయేజనం!రోగాలు చాలా మట్టుకు తగ్గిపోయాయి నేటి శాస్త్ర పరిశోధనలవల్ల! కనిబెడుతూన్న మందుల వలనా—అంటారు. కాని ఏదీ! రోగులూ తగ్గలేదు. ఎన్నిటికి మందులు కనిబెడుతున్నారో, అన్ని కొత్త జబ్బులూ, పుడుతున్నట్టు న్నాయి. ఛీ ఛీ ఇదేమిటి? తను డాక్టరయివుండీ కూడ ఒక సామాన్యు డిలా ఆలోచిస్తున్నాడు?

ఇంతలో ఒక సిస్టర్ పరుగెట్టుకు వచ్చి...

"బాస్ యువర్ మిసెస్ బ్లెస్డ్ విత్ ఎ డాటర్!" అని చెప్పింది.

"అలాగా!" అని అంటూ బయలుదేరబోయాడు.

దారికడ్డంగా—ఇందాక ఆపరేట్ వేసిన అమ్మాయిని స్ట్రెచర్‌లో పడుకోబెట్టి వార్డులోకి తీసుకువెళుతున్నారు — పరీక్షగా అటు చూశాడు.

నలుగు రయిదుగురు డాక్టర్లు, విష్ చేసి బిజీగా వెళ్ళిపోయాటి ప్రక్కనుంచి టకటకా—

మెటర్నిటీ వార్డు వయిపు బయలుదేరాడు.

అతను ఆతృలపడవలసిందీ, ఆశించినదీ, ఏమీలేదు. సంతోషం కలిగించే విషయమా ! అంటే అదీవుండదు! ఇప్పటికి రెండుసార్లయింది. అన్నిసార్లూ ఇదే నిరీక్షణ తీరని నిరాశ, అంతకుమించి విచారంకూడ!— అదే ఇంతవరకూ జరుగుతుంది. ఇంక ఈ మారుమాత్రం ఏం జరుగుతుంది? ఇద్నాళ్ళ కష్ట ఫలితాన్ని చూసుగాని, ఆమెగాని, అతనుగాని, ఆనందించే యోగం ఆతనికి భగవంతుడు వ్రాయలేదేమో!—యిహ నెందుకు ఆతృత—

బరువుగా నడుస్తూ వెళ్ళాడు రూము దగ్గరకు—ఇవతల బెంచీమీద, వ్యాను ఇద్దరు పిల్లలూ కూర్చునివున్నారు. తండ్రినిచూసి... "డాడీ! డాడీ!" అని అంటూ నిలబడ్డారు. దగ్గరికి రాలేదు. వాళ్ళకు సంజీవ్ దగ్గర చనువులేదు. అంతలా దగ్గరకు తీసుకోడు. లోపల ఏమనుకుంటాడోగాని, కనీసం అభిమానం వున్నట్టయినా వుండదు. వారిని చూసి ముఖం అటు త్రిప్పుకున్నాడు.

బాస్ వచ్చేడనేసరికి ఎక్కడివారక్కడ జాగ్రత్త పడ్డారు! లోపల నుండి డాక్టరు అరుణ వచ్చింది! విష్ చేసింది.

"యువర్ మిసెస్ బ్లెస్డ్ విత్ ఎ బ్యూటిఫుల్ డాటర్ !" అని అంది.

"బ్యూటిఫుల్ డాటర్!" అని ఆశ్చర్యంతో గొణిగాడు. అందులో అర్థం బోధపడక వింతగా ఆమె వైపు చూశాడు. ఆమె ముఖంలో— సంతోషంగాని, నవ్వుగాని లేదేం అనుకున్నాడు. ఆమె తల వంచుకొని గదిలోకి దారితీసింది. సంజీవ్ వెనకాతే అనుసరించాడు.

ఎదురుగుండా దృశ్యం అతనిని కలవరపరచింది. దగ్గరగా వెళ్ళేడు. భార్య బెడ్ ప్రక్కన ఉయ్యాలలో చక్కటి పాపని...చూశాడు.

తన కళ్ళను తానే నమ్మలేక పోయేడు. ఆహా ! ఎంత బావుంది ! నిజంగా "బ్యూటిఫుల్ డాటరే !"

మరోసారి చూశాడు. అన్ని అవయవాలు సరిగ్గానే ఉన్నాయి. గుండ్రంగా ముఖం, ఒత్తుగా నల్లటి జుత్తు, ఎరుపూ తెలుపూ కలసిన శరీరం, బొద్దుగా, లావుగా, ఎంత ముద్దుగా వుంది.

ఇంతకు పూర్వం ఇద్దరు పిల్లలు పుట్టారు కాని ఇంత ఆనందం ఎప్పుడూ అనుభవించలేదు. ప్రతిసారి ఏదో ఒక లోపం. పెద్ద కొడుకు పుట్టినప్పుడు ఒక కాలు మెలికలు తిరిగి పోయింది. పుట్టుకతో వచ్చింది ఎన్ని విధాల ప్రయత్నించినా మరి బాగుపడలేదు. రెండో పిల్ల కాళ్ళూ చేతులూ అన్నీ బాగానే వున్నాయి...కానీ ఆమె మొహం బ్రహ్మ రాక్షసిలా ఉంటుంది. ఏక్సిడెంటులో దెబ్బ తగిలినట్టు ముఖం అంతా ఒక ప్రక్కకు అణిగిపోయి వంకరగా, అందవికారంగా ఉంటుంది...యిదీ వరస !

అందువల్లే అతను సంతాన విముఖుడయినాడు. అతనెన్ని కలలు కన్నాడో అన్నీ కరిగిపోయినాయి. తను పిల్లలను చూసుకు మురిసి పోదామంటే వీలులేకండా పోయింది. తన పిల్లలను తనంత వారిని చేద్దామనుకున్న ఆశలు ఏకోశాన్నా లేకండా పోయినాయి. కుటుంబంలో సుఖ సంతోషాలు కరవయి పోయినాయి. ప్రతిసారీ విచారం, దుఃఖం మిగులుతూ వచ్చింది...కానీ యీ మారు...యీ మారు ఆ ఇద్దరూ ఎంత పుణ్యం చేసుకున్నారో బంగారుపాప పుట్టింది !

"పాప పుట్టగానే ఏడ్చిందా ?" అని అడుగుతూ కంటి దగ్గరగా చేతులు పోనిచ్చి పాప రెప్పలు వేయడం చూసి 'ఓకే' అని ఆనందపడ్డాడు.

సుశీల ఎంత ఆనందించిందో యిలాంటి పాపను చూసుకొని— అని సుశీల వైపు చూశాడు. అంతవరకూ పాపని చూసేక కలిగిన ఆనందం పటాపంచలయింది. సుశీలకు తెలివిలేదు—ఆమెకు గ్లూకోజు అక్సిజన్ ఇస్తున్నారు.

అంత సంతోషం పోయి—నిశ్చేష్టుడయి పోయాడు సంజీవ్. అప్పుడు తెలిసింది డాక్టర్ అరుణ ముఖావం.

"ప్రసవం అయిన దగ్గర్నుండి స్పృహలేదు డాక్టర్! మా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం...వెరీసారీ!" అన్నది అరుణ.

తను మాత్రం ఏమి చెయ్యగలడు! తనలాటి స్పెషలిస్టులేఅక్కడ ఉన్నారు. బయటకు వచ్చి తన పిల్లలతో పాటు సామాన్య మానవుడి లాగే బెంచీమీద కూర్చుని "భగవాన్" అని అనుకున్నాడు. పిల్లలు తండ్రి వైపు జాలిగా చూశారు. అతనేమీ అనలేదు కాని...అతని కళ్ళల్లో వాత్సల్యం వాళ్ళు తొలిసారిగా చూశారు.

"బాస్! లోపలికి పదండి అక్కడకూర్చుందురుగాని" అని మరో డాక్టర్ అన్నది.

"అక్కరలేదు మిస్ సురేఖా. నేను ఇక్కడే ఉంటా...మీ రందరూ కలిసి అయినా సుశీలను కాపాడండి...నేనిక్కడ భగవంతుణ్ణి ప్రార్థిస్తాను!" అని అన్నాడు.

హాస్పిటల్ డాక్టర్లు, డాక్టరమ్మలూ, నర్సులూ, సిస్టర్లు అందరూ "బాస్ వైఫ్‌కి సీరియస్" అని తెలియగానే వచ్చి చూసి వెళుతున్నారు.

బయట ఎండ తీక్షణంగా వుంది. మేడల నీడలు, గోడలకి అంటుకు పోయి ఉన్నాయి.

దూరంగా చెట్టుదగ్గర కాకులు అరుస్తూ వలయాకారంగా తిరుగుతున్నాయి. క్రిందపడ్డ కాకిపిల్లకోసం—

ఇవేమీ డాక్టర్ సంజీవ్ గమనించలేదు. అలా తలుపు వైపు నిశ్శబ్దంగా చూస్తూ కూర్చున్నాడు. మీదనుండి ఒక బల్లి చటుక్కున క్రిందపడి...మరి కదలలేదు.

తలుపు తెరచుకుంది. ఆ శబ్దానికి బల్లి పారిపోయింది. డాక్టరు అరుణ పాదాలు మెల్లిగా సంజీవ్ దగ్గరకొచ్చి ఆగిపోయాయి.

"ఎలా వుంది?" అన్నట్టు తల ఎత్తి చూశాడు. ఆతృతతో డాక్టర్ అరుణ చిన్న నవ్వు నవ్వుతూ—

"కంగ్రాట్యులేషన్స్ బాస్. మీరు సుశీలగారితో మాటాడవచ్చును!" అంది.

డాక్టర్ సంజీవ్ హృదయం తేలికపడింది.

ఇద్దరు పిల్లలనీ చెరో చెయ్యీ పట్టుగుని-గదిలోకి నడిపించుగు వెళ్ళేడు. అది చూసిన బంట్రోతు కళ్ళంట నీళ్ళు తిరిగేయి.

"సుశీలా!" అని దగ్గరకు వెళ్ళి ఆప్యాయంగా పిలిచాడు. పిల్లలు చెరో ప్రక్కా చేరారు.

ఆమె మగతలోంచి తేరుకుంటూ చిన్న నవ్వు నవ్వింది.

## మరో ముగింపు

తలుపు తెరుచుకుంది. ఆ శబ్దానికి బల్లి పారి పోయింది. డాక్టరు అడుగు పాదాలు మెల్లగా సంజీవ్ వద్దకు వచ్చి ఆగి పోయాయి.

"ఎలావుంది?" అని అడగబోయాడు సంజీవ్!

రెండు కన్నీటి బొట్లు నేలమీద రాలాయి!

ఆతృతగా తల ఎత్తి చూశాడు——

"ఐయామ్ సారీ...బాస్...సుశీల మరి లేరు...ఎంత ప్రయత్నించినా...బ్రతికించలేక పోయాము."

డాక్టర్ సంజీవ్ హృదయం బ్రద్దలయినంత పనయింది. ఇద్దరు పిల్లల్ని బంట్రోతుకు అప్పజెప్పి తీసుకు వెళ్ళమన్నాడు. ప్రాణం లేని సుశీల దగ్గరకు వెళ్ళి నిశ్చేష్టుడై నిలుచుండి పోయాడు.

"సుశీలా!" అని మనసులోనే పిలిచిన అతని పిలుపుకి ఎక్కడ నుండీ జవాబు రాలేదు.

ఆఖరికి ఒక "బ్యూటిఫుల్ బేబి"ని ఇచ్చి తన ఋణం ఇలా తీర్చుకుంది సుశీల అనుకున్నాడు మూగబాధతో.